పాదగయ ఈవోగా దుర్గాభవానీ బాధ్యతల స్వీకరణ

సత్యదేవుడి సన్నిధిలో సూర్యనమస్కారాలు

నేడు పింఛన్ల పండుగ



- ఉదయం 6గంటల నుంచే ఇంటింటికీ వెళ్లి పంపిణీ
- 2.79లక్షలమంది లబ్ధిదారులకు రూ.188.4కోట్లు అందజేసేలా ప్రణాళిక
- రాత్రిలోగా నూరుశాతం పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు
- పింఛన్ మొత్తాలతో పాటు చంద్రబాబు లేఖ అందజేత

పిఠాపురం, జూన్ 30: జిల్లావ్యాప్తంగా సోమవారం పింఛన్ల పండుగ జరగనుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినెలలోనే పింఛన్ మొత్తాలను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచడమే కాకుండా, మూడునెలల బకాయిలు కలిపి రూ.7వేలను లబ్ధిదారులకు అందించనున్నారు. దివ్యాంగ పింఛన్ రెట్టింపు చేశారు. నిజంగా ఇది లబ్ధిదారులు అందరికీ పండుగ వాతావరణమే. సచివాలయ ఉద్యోగులు ద్వారా ఉదయం 6గంటల నుంచే ఇంటింటికీ వెళ్లి పింఛన్ మొత్తాలను అందించే ఏర్పాటు చేశారు. జిల్లాలోని గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రారంభించనుండగా, మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పంపిణీ కార్యక్రమాల్లో పాలుపంచుకోనున్నారు.

గ్రామ, వార్డు సచివాలయాలు, బ్యాంకులు చుట్టూ ప్రదిక్షణాలు చేస్తూ మూడునెలలుగా పింఛన్లు అందుకునేందుకు లబ్ధిదారులు పడిన అష్టకష్టాలకు చెక్ పడనున్నాయి. అదే సమయంలో పింఛన్ మొత్తాలను ఒకేసారి రూ.వెయ్యి పెంచి ఇవ్వడంతోపాటు ఏప్రిల్, మే, జూన్ నెల బకాయిలను మొత్తంగా ఇంటివద్దే అందించనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. కాకినాడ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా కింద 2,79,319 మంది లబ్ధిదారులు 17రకాల పింఛన్లను అందుకుంటున్నారు. ఇందులో వృద్ధాప్య, వితంతు సహా 11 రకాల పింఛన్ల కింద ప్రతినెలా రూ.3వేలును అందించేవారు. ఇప్పుడు ఈ మొత్తాలను రూ.4వేలకు పెంచారు. ఏప్రిల్, మే, జూన్ నెల బకాయిలు నెలకు రూ.వెయ్యి వంతున రూ.3వేలు, జూలై నెల పింఛన్ రూ.4వేలు వెరసి రూ.7వేలను అందజేయనున్నారు. దివ్యాంగులకు ఇచ్చే పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.6వేలకు, పూర్తి వైకల్యం ఉన్న వారికి రూ.5వేలనుంచి రూ15వేలకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.5వేల నుంచి రూ.10వేలు పింఛన్లను పెంచారు. ఇందుకుగాను జిల్లాకు రూ.188.40కోట్లు విడుదలయ్యాయి.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ..

ఎన్నికల ముందు, అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీతో కలిసి ఉమ్మడి మేనిఫెస్టో విడుదల సందర్భంగా పింఛన్ల మొత్తాలను ఎన్టీఆర్ భరోసా కింద రూ.3వేల నుంచి రూ.4వేలుకు పెంచి ఇస్తామని ప్రకటించారు. పెంపును ఏప్రిల్ నుంచి అమలు చేసి బకాయిలను తాము అధికారంలోకి వచ్చిన తొలినెలలోనే అది జూలైలో రూ.7వేలు వంతున అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ సీఎం బాధ్యతలు చేపట్టిన వెంటనే పింఛన్ల పెంపుపై తొలి సంతకాలు చేశారు. అన్నమాట ప్రకారం ఇప్పుడు సోమవారం వృద్ధాప్య, వితంతు సహా వివిధ పింఛన్లు పొందేవారికి రూ.7వేలు వంతున అందించనున్నారు.

ఉదయం 6గంటలనుంచే

పింఛన్ల పంపిణీని ఉదయం 6గంటల నుంచే ప్రారంభించనున్నారు. ఇందుకుగాను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. ఆయా సచివాలయ పరిధిలో ఉండే లబ్ధిదారులను ఆయా ఉద్యోగులకు సమానంగా కేటాయిస్తూ వారి ఇంటికి వెళ్లి పింఛన్ మొత్తాలను సచివాలయ ఉద్యోగాలు అందించేలా ఏర్పాటు చేశారు. ఇప్పటికే బ్యాంకుల నుంచి నిధులను డ్రా చేసి ఆయా ఉద్యోగులకు అందజేశారు. వీరు ఉదయం 6గంటలకే లబ్ధిదారుల ఇళ్లవద్దకు చేరుకునేలా ఆదేశాలు ఇచ్చారు. సాయంత్రంలోగా నూరుశాతం పంపిణీ పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. లబ్ధిదారులకు పింఛన్ మొత్తాలతోపాటు సీఎం చంద్రబాబు వారికి రాసిన లేఖను అందజేయనున్నారు.

ఆ మూడు నెలలు కష్టాలే..

పింఛన్లు అందుకునేందుకు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో లబ్ధిదారులు పడిన కష్టాలు అన్నిఇన్ని కావు. వాలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో సచివాలయ ఉద్యోగులు ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే అవకాశమున్నా అప్పటి వైసీపీ సర్కారు ఆ విధంగా చేయలేదు. ఏప్రిల్‌లో సచివాలయాలకు వెళ్లి తీసుకోవాలని సూచించింది.

నాడు.. ఇప్పుడు పింఛన్లు పెంచింది బాబే

ఎన్టీఆర్ భరోసా కింద పేదలకు అందించే పింఛన్ల మొత్తాలను భారీగా పెంచిన ఘనత టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుకే దక్కుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.200లను పింఛన్‌గా అందించేది. రాష్ట్ర విభజన తర్వాత అధికారం చేపట్టిన వెంటనే చంద్రబాబు దాన్ని అయిదు రెట్లు ఒకేసారి పెంచి రూ.వెయ్యి చేశారు. 2019 జనవరి నెలలో రూ.వెయ్యి నుంచి పింఛన్ మొత్తాన్ని రెట్టింపు చేసి రూ.2వేలకు పెంచారు. అంటే కాంగ్రెస్ హయాంలో కంటే పది రెట్లు అధికంగా నాటి టీడీపీ ప్రభుత్వం పింఛన్లు పెంచింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో వస్తే పింఛన్‌ను రూ.3వేలకు పెంచుతామన్న జగన్ మాట మడతేసి ఏడాదికి రూ.250 వంతున పెంచుతూ ఎన్నికల ముందు దాన్ని రూ.3వేలకు పెంచారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తే రూ.4వేలకు పెంచుతామన్న మాటను నిలబెట్టుకుంటూ టీడీపీ, జనసేన, బీజేపీ సర్కారు ఏర్పడగానే సీఎం చంద్రబాబు పింఛన్ మొత్తాలను పెంచడమేగాక ఏప్రిల్ నెల నుంచి అమలు చేసి పాతబకాయిలును ఇస్తూ ఏదైనా తమతోనే సాధ్యమని నిరూపించుకున్నారు. జూన్‌లో కాకినాడ జిల్లాలో పింఛన్ నిమిత్తం లబ్ధిదారులకు రూ.82.90కోట్లు అందించగా, జూలై నెలలో ఏకంగా 127శాతం అధికంగా రూ.188.40కోట్లను అందించనున్నారు.

పింఛన్ల పంపిణీని పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించనున్నారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం, కాకినాడ రూరల్, కాకినాడ సిటీ నియోజవకర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలు పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నేతలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నేడు పింఛన్ల పంపిణీ సజావుగా నిర్వహించాలి: జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 30: జిల్లాలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియకు అనుసరించాల్సిన విధానాలపై ఆదివారం కలెక్టరేట్‌లో జేసీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్ల కింద జూలై నెలనుంచి ఎన్టీఆర్ భరోసా పేరుతో పంపిణీ చేపట్టనుందన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న కార్యక్రమం అయినందున సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై అధికారులు ప్రత్యేక దృషి సారించాలన్నారు. జిల్లాలో వివిధ రకాల పింఛన్ల కింద 27,9319మందికి రూ.188.40కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరమణి, డీఎల్‌డీవో నారాయణమూర్తి, వీవోలు పాల్గొన్నారు.





గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీ జరిగే ఫంక్షన్ హాలు

గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంపై పవన్ ఫొటోలతో ఎగురవేసిన బెలూన్

నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక



- గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీలో పాల్గొననున్న జనసేనాని
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్
- పర్యటనకు భారీ బందోబస్తు
- మూడురోజులపాటు జిల్లాలో కార్యక్రమాలు

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 30: పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి రానున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్‌కల్యాణ్ పర్యటనకు సర్వం సిద్ధమైంది. ఇటు అధికార యంత్రాంగంతోపాటు జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి సోమవారం వస్తున్న పవన్‌కల్యాణ్ గొల్లప్రోలులోని సత్యకృష్ణ కల్యాణమండపంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు. పవన్ చేబ్రోలు నివాసంలో మూడు రోజులు ఉండనున్న నేపథ్యంలో అక్కడ భారీఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు ఇంటిపై భారీ బెలూన్ ఏర్పాటు చేశారు. ఇంటివద్ద బారికేడింగ్ ఏర్పాటు చేశారు. కాగా పవన్ పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ పరిశీలించారు. గొల్లప్రోలు హెలిప్యాడ్‌తోపాటు పవన్ పర్యటించే ప్రాంతాల్లో పరిశీలన జరిపి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట కాకినాడ ఆర్డీవో కిషోర్, డీఎస్పీ హనుమంతరావు, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి తదితరులు ఉన్నారు.

పవన్ పర్యటన సాగేది ఇలా..

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం నుంచి మూడురోజులపాటు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. పవన్ పర్యటన వివరాలను అధికారికంగా ఆదివారం రాత్రి వెల్లడించారు.

నేడు పింఛన్ల పంపిణీ

సోమవారం ఉదయం 6గంటలకు హైదరాబాద్‌లోని తన ఇంటినుంచి బయలుదేరి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. 6.30గంటలకు అక్కడ బయలుదేరి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఉదయం 7.30 గంటలకు అక్కడ బయలుదేరి గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసానికి ఉదయం 9గంటలకు చేరుకుంటారు. తిరిగి 9.45 గంటలకు బయలుదేరి 10గంటలకు గొల్లప్రోలు పట్టణంలో సత్యకృష్ణ ఫంక్షన్‌హాలుకు చేరతారు. అక్కడ 12.30గంటల వరకూ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేస్తారు. అనంతరం అక్కడినుంచి బయలుదేరి చేబ్రోలులోని నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం తర్వాత మధ్యాహ్నం పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

రేపు శాఖలవారీగా సమీక్ష

2వతేదీన ఉదయం 9.30గంటలకు చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి 10గంటలకు కాకినాడ కలెక్టరేట్ చేరుకుంటారు. 10నుంచి 11గంటల వరకూ కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల అధికారులతో, 11నుంచి 11.30గంటల వరకూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో, 11.30నుంచి 12గంటల వరకూ రోడ్ల పరిస్థితిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో, 12గంటల నుంచి ఒంటి గంట వరకూ అటవీశాఖ అధికారులతో, ఒంటి గంట నుంచి రెండు గంటల వరకూ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులతో, అనంతరం సైన్స్ అండ్ టెక్నాలజీ అధికారులతో సమావేశమవుతారు. అక్కడినుంచి మధ్యాహ్నం 2.30గంటలకు చేబ్రోలు నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం తర్వాత జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశమవుతారు.

ఎల్లుండి బహిరంగసభ

3వతేదీన ఉదయం 10గంటలకు చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకుంటారు. 10.45గంటల నుంచి 12గంటల వరకూ సముద్రపు కోత ప్రాంతాన్ని పరిశీలిస్తారు. 12.45గంటలకు చేబ్రోలు నివాసానికి చేరుకుని పిఠాపురం నియోజకవర్గ అధికారులతో సమావేశమవుతారు. అనంతరం టీడీపీ, జనసేన ముఖ్యనేతలతో భేటీ ఉంటుంది. మధ్యాహ్నం 3.30గంటలకు చేబ్రోలు నుంచి బయలుదేరి పిఠాపురం పట్టణం ఉప్పాడ సెంటర్‌లో జరిగే వారాహి బహిరంగసభ వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 6గంటలకు అక్కడినుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక డీఎస్పీతోపాటు 8మంది సీఐలు, 20మంది ఎస్ఐలు, 200మంది సిబ్బందిని బందోబస్తు నిమిత్తం నియమించారు. ఎనిమిది రోప్ పార్టీలను రంగంలోకి దించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ రద్దు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 30: నేడు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన పిఠాపురంలో ఉన్నందున, జిల్లాలోని మున్సిపాల్టీలు, గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నేపథ్యంలో అధికారులు అందరూ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు: డీఎంహెచ్‌వో



గొల్లప్రోలు పీహెచ్‌సీలో అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో

గొల్లప్రోలు, జూన్ 30: గొల్లప్రోలు పట్టణంలో డయేరియా ప్రబలకుండా అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నామని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు వాంతులు, విరోచనాలతో బాధపడుతూ రోగులు వస్తున్నారని, డయేరియా జాడలు కనిపిస్తున్నాయని ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీఎంహెచ్‌వో పట్టణంలో పర్యటించారు. డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనరు రవికుమార్‌కు సూచించారు. అంతకుముందు గొల్లప్రోలు దేవీనగర్‌లో వైద్యాధికారులు తాగునీటి శాంపిల్స్ సేకరించారు. ఆయన వెంట డీఐవో డాక్టర్ రత్నకుమార్, స్టాటికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, వైద్యాధికారులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ రామకుమార్ ఉన్నారు.

కాకినాడ రూరల్ ఎంపీపీ రాజీనామా ఆమోదం

ఇన్‌చార్జి ఎంపీపీగా బందిలి విరీష

సర్పవరం జంక్షన్, జూన్ 30: కాకినాడ రూరల్ ఎంపీపీ గోపిశెట్టి పద్మజ రాజీనామాను ఆమోదించినట్లు జిల్లా పరిషత్తు సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి ఆదివారం విడుదల చేసి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తూ శనివారం సమర్పించిన లేఖను కలెక్టర్‌కు నివేదించగా తదుపరి ఉత్తర్వుల రాజీనామాను ఆమోదించామన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాటులో భాగంగా వైస్ ఎంపీపీగా ఉన్న బందిలి విరీష(తిమ్మాపురం ఎంపీటీసీ-1)ను ఇన్‌చార్జి ఎంపీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వైస్ ఎంపీపీగా ఉన్న తనకు ఇన్‌చార్జి ఎంపీపీగా నియామకం చేయడం ఆనందంగా ఉందని, మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఇన్‌చార్జి ఎంపీపీ విరీషను వైసీపీ నాయకులు బెజవాడ సత్యనారాయణ, రాందేవు చిన్న, పుల్ల చందూ, పుల్ల కోటేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.

‘సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి’

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 30: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. ప్రజలకు వైద్యసేవలందించేందుకు నగరపాలకసంస్థ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే నగరపాలక సంస్థ టోల్‌ఫ్రీ నెంబర్ 18004255990కు కాల్‌చేయాలని సూచించారు.

డిసెంబర్‌లో కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

కాకినాడ సిటీ, జూన్ 30: ఆంధ్రప్రదేశ్-ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను ఈ ఏడాది డిసెంబర్‌లో కాకినాడలో నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సన్నాహక సమావేశం యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరావు(ఐవీ), యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, సీనియర్ నేత గారా చిట్టిబాబు మాట్లాడుతూ డిసెంబర్ 14,15,16,17 తేదీల్లో ఈ మహాసభలు కాకినాడలో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20వేలమంది ఉపాధ్యాయులు ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు. ఉపాధ్యాయులతోపాటు ప్రజాప్రతినిధులు, నగర, జిల్లా ప్రముఖులు, విద్యావేత్తలు, విద్యాశ్రేయోభిలాషులు మహాసభల విజయవంతానికి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, నేతలు జి.ప్రభాకరవర్మ, ఎంవీ సాయిరామ్, పెంకే వెంకటేశ్వరరావు, జయకర్, వై.విల్సన్‌బాబు, ఎస్ఎస్ నాయుడు, రెడ్డి మోహన్‌రావు, కిషోర్, జీవీ రమణ, సుభాషిణి, అరుణకుమారి పాల్గొన్నారు.

కొత్త ఒరవడికి సీఎం చంద్రబాబు శ్రీకారం

» జనసేన అధినేత పవన్‌కు ఘనస్వాగతం పలకాలి » పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జూన్ 30: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం జరగనున్న పింఛన్ల పండుగలో కొత్త ఒరవడికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుడతారని, ఇంటింటికి సీఎంయే స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేస్తారని, ఇది దేశ చరిత్రలోనే తొలిసారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచడమే గాక ఏప్రిల్ నుంచి బకాయిలతో కలిసి రూ.7వేలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి వస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు జనసేన కార్యకర్తలతో కలిసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలకాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పిఠాపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

సముద్రకోత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్



ఉప్పాడ మినీ హార్బర్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఉప్పాడ (కొత్తపల్లి), జూన్ 30: ఉప్పాడ తీరంలో తరచూ సముద్రకోతకు గురవుతున్న ప్రాంతాలను జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదివారం పరిశీలించారు. ఈనెల 3న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ఉప్పాడ లో సముద్రకోతకు గురవుతున్న ప్రాంతాల్లో పర్యటించనున్న దృష్ట్యా కలెక్టర్ సూరాడపేట, ఉప్పాడ నిర్మాణంలో ఉన్న మినీ హార్బర్ ప్రాంతాలను పరిశీలించారు. సూరాడపేటలో మత్స్యకారులతో మాట్లాడారు. గతంలో ఏర్పాటు చేసిన జియోట్యూబ్ టెక్నాలజీతో సముద్రకెరటాలు ఇళ్లల్లోకి వచ్చేవి కాదని మత్స్యకార నాయకుడు సూరాడ నాగేశ్వర రావు కలెక్టర్‌కు తెలియజేశారు. సముద్రకోత నుంచి ఉప్పాడ గ్రామాన్ని జియోట్యూబ్ టెక్నాలజీ అడ్డుకట్ట వేయ వచ్చని చెప్పారు. ఉప్పాడ హార్బర్‌లో మొగను డ్రెడ్జింగ్ చేయించాలని మత్స్యకారులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. పవన్‌కల్యాన్ పర్యటనలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట కాకినాడ డీఎస్పీ కోపల్లె హను మంతరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, ఆర్అండ్‌బీ ఎస్ఈ క్రాంతి, జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకర్, ఆర్డీవో ఇట్ల కిషోర్, ఉప్పాడ మత్స్యశాఖ అధికారి రామకృష్ణ ఉన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S.235/2023

Between:
బొగిరెడ్డి వెంకటరమణ – వాది
And
పులిదిండి మెషేక్ సామ్యూల్ బాబురావు – ప్రతివాది

పై నెంబరు దావా వాది, ప్రతివాదిపై పరిహారం కోరుతూ దాఖలు చేయడమైనది. సదరు దావాలో ప్రతివాదికి ఎన్నిమార్లు సమన్లు పంపినను త్రిప్పి వేయుచున్నందున కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం యిందుమూలముగా తెలియచేయునది ఏమనగా పై నెంబరు దావా ది.వి.05-07-2024వ తేదీ వాయిదా అయివున్నది.

కావున మీరు పై కోర్టువారు ఎదుట ఉదయం 10.30 గం.లకు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని అభ్యంతరములు యున్న తెలుపుకొన గలరు. లేని యెడల మీ పరోక్షములో నిర్ణయించ బడునని గ్రహించ గలరు. వివరాలకు.

K.V.V. CHALAPATHI, M.A.,B.L.,D.P.M
Advocate
D.no. 9-11-136, Gandhi Nagar
Nookalamma Temple Street,
Kakinada.
Cell:98482 60426

కాకినాడ
05.06.2024

నేడు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నున్న రామకృష్ణ బాధ్యతలు



నున్న రామకృష్ణ

సామర్లకోట, జూన్ 30: కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సామర్లకోట మండలం వేట్లపాలేనికి చెందిన యువ పారిశ్రామికవేత్త, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు నున్న రామకృష్ణ సోమవారం కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జిల్లా అధికారులు, రైస్‌మిల్లర్ల సమక్షంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లాలో 7 నియోజకవర్గాలకు చెంది 175 మిల్లులకు సంబంధించి యజమానులు ఏకగ్రీవంగా నున్న రామకృష్ణ పేరును మాత్రమే ప్రతిపాదించడంతో రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అనుంగు సహచరుడిగా పేరొందిన రామకృష్ణ మూడు దశాబ్దాలుగా రైస్‌మిల్లుల నిర్వహణలో చురుకైన పారిశ్రామివేత్తగా పేరొందారు. రైస్ మిల్లుల నిర్వహణ మాత్రమే కాకుండా సగ్గుబియ్యం పరిశ్రమలను సైతం నిర్వహించి తమిళనాడులోని సేలం మార్కెట్లో ఆంధ్రా సగ్గుబియ్యానికి ప్రాచుర్యం కల్పించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలను ఎంతగా అణగదొక్కాలని చూసినా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరోక్షంగా టీడీపీ బలోపేతానికి, కూటమి విజయానికి నున్న ఎంతో కృషి చేశారు.

కాకినాడ

• కాకినాడ రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

బహుజన టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు



నూతన కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులు

కాకినాడ రూరల్, జూన్ 30: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బహుజన టీచర్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఆదివారం కాకినాడ గాంధీనగర్ పార్కులో విశ్రాంత ఉద్యోగుల సమావేశ మందిరంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ సభ్యులు అత్యవసర సమావేశం జిల్లా అధ్యక్షుడు బొజ్జ శరత్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంద పల్లి నాగేశ్వరరావు, ఎలిపే నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గంలోకి ముగ్గురు సభ్యులను తీసుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఆర్కే రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహ్మద్ బాష, జిల్లా ఆర్థిక కార్యదర్శిగా ఆర్‌వీఎస్ఎన్ చిన్నలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ ఈ సంఘాన్ని గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విస్తరించాలని కోరారు. ప్రతీ నెల రెండో శనివారం స్థానిక పెన్షనర్స్ హాల్లో నిర్వహించాలని నిర్ణయించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ శరత్‌కుమార్ తెలిపారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

సామర్లకోట, జూన్ 30: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా సోమవారం పింఛన్ లబ్ధిదారులకు పెంచిన పింఛన్ సొమ్ములతో సహ కొత్త పింఛన్ సొమ్ములు పంపిణీ చేయనున్నట్టు అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అధికారి తెలిపారు. ముందుగా అచ్చంపేటలోని ఉదయం 8గంటలకు సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప ప్రారంభిస్తారని అనంతరం ఉండూరు గ్రామంలో పంచాయతీ వద్ద ఫించన్లను పంపిణీ చేస్తారన్నారు. అనంతరం 9.00 గంటలకు పెద్దాపురంలో ఫించన్లు పంపిణీ చేస్తారని, 9.30 గంటలకు దివిలి గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం 10.30 గంటలకు సామర్లకోట 5వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. సాయంత్రం 6 గంటలకు పెద్దాపురం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారని క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు.

కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్ల సొమ్ములు పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9 గంటలకు పెద్దాపురంలో సచివాలయం నందు, సామర్లకోటలో ఉదయం 11 గంటలకు 5వ వార్డు సచివాలయం నందు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు జనసేన పార్టీ జిల్లా నాయకుడు సరోజావాసు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కూటమి పార్టీల నాయకులు, వీరమహిళలు, జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కాకినాడ రూరల్ మండలంలో...

సర్పవరం జంక్షన్, జూన్ 30: తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచిన రూ.4 వేలు పింఛన్లు సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాకినాడ రూరల్ మండలంలో వృద్ధులు, వికలాంగులు, చేనేత, మత్స్యకార, బీసీ, వితంతువులు తదితర లబ్ధిదారులు 18,453 మంది ఉన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సోమవారం ఉదయం 8 గంటలకు పెంచిన పింఛన్ సొమ్ము రూ.4 వేలు లబ్ధిదారులకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేతులమీదుగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వంపెంచిన పింఛన్ సొమ్ము ఏప్రిల్, మే, జూన్ సొమ్ము రూ.3 వేలు ఎరియర్స్‌తో జూలై నెల రూ. 4 వేలు కలిపి మొత్తం ఒకేసారి రూ.7 వేలు లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు సచివాలయ కార్యదర్శిల ఆధ్వర్యంలో సిబ్బందితో కలసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెంచిన పింఛన్ సొమ్ము అందిస్తామన్నారు.

ఎమ్మెల్యే నానాజీ పర్యటన వివరాలు

సోమవారం ఉదయం 8 గంటలకు నేమాంలో జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొంటారు. 9గంటలకు పండూరులో పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించే డయేరియా అవగాహన సమావేశంలో పాల్గొంటారు. 10 గంటలకు రమణయ్యపేట ఒకటో డివిజన్‌లో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తారు. అనంతరం కరప మండలం గురజనాపల్లిలో 11 గంటలకు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు. 12 గంటలకు కాకినాడ రూరల్ ఇంద్రపాలెంలో ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొంటారు.

పవన్ పర్యటనను విజయవంతం చేయాలి

జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి అజయకుమార్

గొల్లప్రోలు రూరల్, జూన్ 30: పిఠాపురం నియోజకవర్గంలో మూడురోజులు పాటు జరిగే డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి అజయకుమార్ కోరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ నివాసంలో జనసేన నాయకులు, కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి

● రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్




అధికారులతో పర్యాటకంపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి దుర్గేష్. గండి పోశమ్మను దర్శించుకుంటున్న దుర్గేష్

దేవీపట్నం, జూన్ 30: పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం మంత్రి దుర్గేష్ దేవీపట్నం మండలంలో పోశమ్మగండిలో పర్యటించారు. పర్యాటక బోట్లపై గోదావరి పరివాహక ప్రాంతాలను సందర్శించారు. పాపికొండలు పర్యాటకంపై సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పర్యాటకులతో సైతం పాపికొండల విహారయాత్రపై మాట్లాడారు. అనంతరం మంత్రి దుర్గేష్ విలేకరులతో మాట్లాడుతూ సరైన నిబంధనలు పాటిస్తున్నారా, గతంలో జరిగిన ఘటనల పట్ల ఏవిధంగా జాగ్రత్త చర్యలు తీసుకుంటారో పరిశీలించడానికి రావడం జరిగిందన్నారు. మొత్తం 16బోట్లు ఉండగా రెండు టూరిజం డిపార్టుమెంటుకి చెందగా 14బోట్లు ప్రయివేట్ బోట్లన్నారు. సందర్శకులతో పర్యటనపై మాట్లాడగా అనుభూతి కలిగిందని చెబుతూ కొన్ని సదుపాయాలు కావాలని అడిగారన్నారు. పర్యాటకులకు అన్నిరకాల సదుపాయాలు ఏర్పాటుచేశామన్నారు. బోట్‌సేఫ్టీ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. గుడిసె ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని వివరించారు. అలాగే మంత్రి దుర్గేష్ మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది స్వాగతంపలికి ఘనంగా సత్కరించి అమ్మవారిఫొటోను బహూకరించారు.

పోలవరం ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

నిడదవోలు, జూన్ 30: వైసీపీ ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేసిందని దాంతో ప్రాజెక్ట్ పూర్తిగా పడకేసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సాక్షాత్తూ జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబే పోలవరం ప్రాజెక్ట్ ఏంటో నాకే అర్థం కావడం లేదన్నారని, దీని ద్వారా గత ప్రభుత్వ విధానం ఏమిటో మనకు అర్థమవుతుందన్నారు. సీఎం చంద్రబాబు పోలవరం ప్రా జెక్ట్‌పై శ్వేతపత్రం విడుదల చేశారని, గత ప్రభుత్వంలో ప్రాజెక్ట్ ఒక ఇంచ్ అభివృద్ధి కూడా జరగలేదని 2014-19 మధ్య సీఎం చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి జరిగిందని, తిరిగి మళ్లీ ఇప్పుడు 2024-29 వరకు ఆయన హయాంలోనే పూర్తవు తుందన్నారు. గత ప్రభుత్వానికి కాపర్‌డ్యామ్, డయాఫ్రమ్ వాల్ అంటే ఏంటో కూడా తెలియదన్నారు. ఇప్పుడు ప్రాజెక్ట్‌ను పరుగులు పెట్టించడానికి అంతర్జాతీయస్థాయికి చెందిన సాంకేతిక నిపుణుల బృందం వచ్చిందన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు వైజాగ్, తిరుపతి, కడియం తదితర ప్రాంతాలపై దృష్టి సా రించామని దుర్గేష్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం రబీలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిందని, ఎన్నికల పేరుతో రైతాంగానికి డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రబీ ధాన్యం కొనుగోలు సొమ్మును రైతాంగానికి అందించేందుకు కేబినెట్ మీటింగ్‌లో చర్చించామని, అతి త్వరలోనే రైతులకు డబ్బులు అందిస్తామని మంత్రి దుర్గేష్ అన్నారు.

10 వేల సత్యదీక్షల పుస్తకాలు వితరణ



సత్యదీక్షల పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఈవో, తదితరులు

అన్నవరం, జూన్ 30: హైదరాబాద్‌కు చెందిన గోవిందమాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అచ్చువేయించిన సత్యదీక్షల పుస్తకాలను ఆదివారం దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ ఆవిష్కరించారు. ప్రతీ ఏటా ఆశ్వీయుజ మాసంలో వచ్చే మఖ నక్షత్రం రోజు నుంచి కార్తీకమాసంలో వచ్చే మఖ నక్షత్రం రోజువరకు భక్తులు సత్యదీక్షలు స్వీకరిస్తుంటారు. ఈఏడాది వారికి ఉచితంగా సత్యదీక్షల పుస్తకాలు అందించాలని సుమారు 10వేల పుస్తకాలను దేవస్థానం ఈవో కు ఫౌండేషన్ సభ్యులు అల్లం సాయికుమార్, గుంటుకు రామకృష్ణలు అందించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ సభ్యులను ఈవో అభినందించారు.

సత్యదేవుడికి హైకోర్టు న్యాయమూర్తి పూజలు



హైకోర్టు న్యాయమూర్తికి సత్యదేవుడి మెమెంటో అందజేస్తున్న ఈవో

అన్నవరం, జూన్ 30: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.వి.రవీంద్రబాబు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా ఈవో వారికి స్వామివారి మెమెంటో, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

లోవకు పోటెత్తిన భక్తులు

● ఆలయానికి రూ.6.77లక్షల ఆదాయం




అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తునిరూరల్, జూన్30: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దేవస్థానం ఏర్పాటుచేసిన క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటుచేసిన వసతి గదులు, వంట షెడ్డుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.6.77లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాధ్‌రాజు తెలిపారు.



భారీ అవినీతి

(రంపచోడవరం)

మారేడుమిల్లి మండలంలోని సుందరమైన ప్రాకృతిక వనరులను ఎరగా వేసి ఎకో టూరిజం ముసుగులో రంపచోడవరం అటవీ డివిజన్లోని అధికారులు భారీ అవినీతికి పాల్పడ్డారు. ఎకో టూరిజం ప్రాజెక్టుల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు పాటించకుండా, కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీలను నియమించకుండా లేని అధికారాన్ని తమకు తామే కట్టబెట్టుకుని ఎకో టూరిజం నిధులను కోట్లలో లావాదేవీలు సాగించేసి సానుకూలతల మేరకు అక్రమాలు, అవినీతికి పాల్పడిన భాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. పూర్వాపరాలు ఇలా ఉన్నాయి...

● లేని అధికారాన్ని కట్టబెట్టుకుని నిధులు డ్రా చేసిన అటవీ అధికార్లు
● సీసీఎఫ్ ఆమోదం లేకుండానే కోట్లాది రూపాయల లావాదేవీలు
● ఒక్క గుడిసె పర్యాటకం పేరుతోనే అనేక అక్రమాలు

అడవిలో ఉన్న పర్యాటక ప్రదేశాలను పర్యాటకులకు అనువుగా తీర్చిదిద్ది కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం(సి.బి.ఇ.టి) పేరుతో మారేడుమిల్లి మండలంలో వనవిహారి, జంగిల్ స్టార్, గుడిసె ప్రాంతాలను అటవీశాఖకు అనుబంధంగా రూపొందించారు. ఈ కేంద్రాలను పర్యావరణ హితంగా సి.బి.ఇ.టి.కమిటీల ద్వారా నిర్వహించడం, వచ్చిన ఆదాయాన్ని కమిటీలకు పంచడం, నిధులను పర్యావరణ పరిరక్షణకు వినియోగించడం, నిర్వహణా ఖర్చులు వంటి అంశాలకు నిబంధనలకు అనుగుణంగా నిధులను వెచ్చించాలి. అయితే ఈ నిధుల వెచ్చింపు అంశాన్నే ప్రాధాన్యంగా తీసుకుని అటవీ అధికారులు మొత్తం పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని అటవీ అధికారులు వ్యవహరించి భారీగా అవకతవకలకు పాల్పడ్డారు. ఒక్క గుడిసె ఎకోటూరిజం ప్రాజెక్టునే తీసుకుంటే అక్కడ కమిటీని రద్దుచేసి కొత్త కమిటీని నియమించకుండా దాని నిర్వహణను రంపచోడవరం డివిజనల్ అధికారి, మారేడుమిల్లిరేంజ్ అటవీ అధికారి కలిసి చేపట్టారు. కమిటీ పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాను తామే నడిపి, నిధులను డ్రా చేసుకునే విధంగా డీఎఫ్‌వో తనకు తానే అధికారాన్ని కట్టబెట్టుకోవడం, తద్వారా మారేడుమిల్లి రేంజ్ అధికారితో కలిసి నిధులను విచక్షణా రహితంగా డ్రా చేయడం వివాదంగా మారింది. ఇక్కడ సుమారు రూ.3 కోట్లవరకూ బ్యాంకు నుంచి డ్రా చేసిన నిధులలో చాలా వరకూ నిధులకు సరైన లెక్కలు లేవని సమాచారం.

రాజమహేంద్రవరం చీఫ్ కన్జర్వేటర్ అనుమతులు లేకుండానే తనకు తానుగా అధికారాన్ని కట్టబెట్టుకుని నిధుల లావాదేవీలకు పాల్పడటాన్ని ఇటీవల జరిగిన ఎకౌంట్స్ అధికారి పరిశీలనలో తూర్పారబెట్టారు. నిబంధనల ప్రకారం బ్యాంకు ఖాతాల్లో 50శాతం నిధులను ఉంచి తీరాలన్న అంశాన్ని కూడా ఉల్లంఘించడం, ఎకో టూరిజం నిధులను కార్యాలయాలు, నివాసాల, వాహనాల పనుల కోసం వెచ్చించడం వంటి అంశాలను గుర్తించిన సీసీఎఫ్ శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఈ పరంపరలో శాఖాపరమైన విజిలెన్సు ఉన్నతాధికారి ఎకో టూరిజం ప్రాజెక్టులను పరిశీలించి తీగలాగి మొత్తం అక్రమాల డొంకను కదుపుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి కార్యాచరణ ప్రణాళికలూ లేకుండా చేసిన ఖర్చులే వివాదంగా మారగా, మరో ప్రక్క రూ.50లక్షల నుంచి కోటి రూపాయలలోపు ఖర్చులకు సరైన లెక్కలు లేవని అటవీశాఖలోనే చర్చ సాగుతోంది. ఇదిలావుండగా ఇప్పటికే మారేడుమిల్లి అడవుల్లో చోటుచేసుకున్న అనేక అక్రమాలపై ప్రభుత్వం వద్ద చర్యలకు ఫైళ్లు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఈ ఎకో టూరిజం భాగోతం కూడా దానికి తోడై పవన్‌కళ్యాణ్ సారథ్యంలో ఉన్న అటవీశాఖ ఎటువంటి చర్యలను తీసుకుంటుందో చూడాలి.

హోం మంత్రి ఓఎస్డీగా అడిషనల్ ఎస్పీ అనిల్‌కుమార్



రాజమహేంద్రవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ హోం మంత్రికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్డీ)గా తూర్పుగోదావరి జిల్లా శాంతిభద్రతల అడిషనల్ ఎస్పీ పి.అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఎస్‌బీ ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేస్తూ హోంమంత్రి వంగలపూడి అనితకు ఓఎస్డీగా నియమిస్తూ ఆర్‌సీ నెం.677/జీ2/2024 ద్వారా ఆదివారంరాత్రి డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అనిల్ విశాఖ జిల్లాకు చెందినవారు. అందువల్ల పాడేరు అడిషనల్ ఎస్పీగా పనిచేస్తూ ఎన్నికల సందర్భంగా ఫిబ్రవరి 13న జిల్లాకు వచ్చారు. 2012 గ్రూప్-1 అధికారి అయిన అనీల్‌కుమార్‌కి సమర్థవంతమైన అధికా రిగా పేరుంది. జిల్లాలోని ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషించారు. కాగా, బదిలీపై ప్రభుత్వ ఆదేశాలు(జీవో) జారీ కావాల్సి ఉంది. దీంతో ఒకటి రెండు రోజుల్లో ఆయన జిల్లా నుంచి రిలీవ్ అయ్యి నూతన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీ జగదీశ్, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పాదగయ ఈవోగా దుర్గాభవానీ



పాదగయ ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న దుర్గాభవానీ

పిఠాపురం, జూన్ 30: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్‌గా ఏవీ దుర్గాభవానీ ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈమె రాజమహేంద్రవరం దేవదాయశాఖ ఆర్‌జేసీ కార్యాలయంలో జ్యువలరీ వెరిఫిషన్ ఆఫీసరుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకూ పాదగయ ఈవోగా పనిచేసిన ఏసీ పులి నారాయణమూర్తి రిటైర్డ్ కావడంతో దుర్గాభవానీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పాదగయకు వచ్చిన ఆమె కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూ జలు నిర్వహించారు, అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈవోను ఆలయ సిబ్బంది, అర్చకు లు కలుసుకుని అభినందనలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాదగయ పరిసరాలను పరిశీలించారు. భక్తులు, దాతలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది అందరూ తప్పనిసరిగా యూనిఫారమ్ ధరించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులతో గౌరవంగా, మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు.

జూలై 1 స్పెషల్..

నేడు ఎన్నెన్ని 'రోజు'లో.. అన్నీ ప్రత్యేకమే..!

అమలాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో ప్రతి రోజుకూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అయితే కొన్ని రోజులకు మాత్రం జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రత్యేకతలుంటాయి. మనిషి జీవితంలో 'పుట్టినరోజు'కు ఎనలేని ప్రత్యేకత ఉంటుంది. అలాగే సంస్థలకు, సంఘాలకు, వ్యక్తులకు కూడా కొన్ని ప్రత్యేక రోజులుంటాయి. అటువంటి ప్రత్యేకత కలిగిన రోజులలో జూలై 1ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. జూలై 1 అనగానే గ్రామీణ ప్రాంత వైద్యుల నుంచి అంతర్జాతీయస్థాయిలో కీర్తినార్జించిన డాక్టర్ల వరకూ అంతా 'వైద్యుల దినోత్సవం'గా జరుపుకుంటారు. డాక్టర్ బీసీ రాయ్ జయంతిని డాక్టర్స్ డేగా ఏటా నిర్వహించుకుంటున్నారు. రెండు ప్రధానమైన బ్యాంకులను జూలై 1నే ప్రారంభించారు. కెనరా బ్యాంకును 1906 జూలై 1న ప్రారంభించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను 1955 జూలై 1నే స్థాపించారు. దాంతో ఈ రెండు బ్యాంకులు ఈ రోజును వ్యవస్థాపక దినోత్సవంగా జరుపుకుంటు న్నాయి. ఎంత పెద్ద సంస్థలకైనా, వ్యాపారాలకైనా ఖచ్చితమైన లెక్కలుం డాలి. లెక్కతప్పిందా అంతే సంగతులు. అందుకే అంకెల మాంత్రికులుగా పేరొందిన చార్టెర్డ్ అకౌంటెంట్స్ లేకుండా వ్యాపారాల లెక్కలు మాత్రం తేలవు. ఇటువంటివారికి కూడా ఒక రోజుందండోయ్. అదే 'చార్టెర్డ్ అకౌంటెంట్స్ డే'. 1949 జూలై 1న చార్టెర్డ్ అకౌంటెంట్లను స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థగా ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి చార్టెర్డ్ అకౌం టెంట్స్ డే నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణాల రూపకర్తలైన ఆర్కిటె క్చర్లకు ఒక ప్రత్యేకమైన రోజుంది. ఆధునిక కాలంలో ఆర్కిటెక్చర్లకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. అందమైన గృహాలు, కట్టడాలు నిర్మించుకునేందుకు జనం పోటీపడుతుండడంతో ఆర్కిటెక్చర్లకు డిమాండు పెరిగింది. అలాగే ప్రతిఏటా జూలై 1న ఆర్కిటెక్చర్స్ డేను నిర్వహించుకుంటారు. ఇన్ని ప్రత్యేకతలు కలిగిన ఈ రోజుకు మరికొన్ని విశేషాలు ఉన్నాయి. ఇండియాలో తొలిసారిగా పోస్టు కార్డును జూలై 1నే ప్రవేశపెట్టారు. రోదసిలో మృతి చెందిన ప్రముఖ వ్యోమగామి కల్పనా చావ్లా జయంతి కూడా ఇదే రోజు. అదండీ.. జూలై 1కి ఇన్ని ప్రత్యేకతలున్నాయి.



డాక్టర్ బీసీ రాయ్ పేరిట విడుదల చేసిన పోస్టల్ స్టాంపు



చార్టెడ్ అక్కౌంటెంట్స్ డే

ఉన్నత విద్యలతోపాటు సమాజంలోని మార్పులు ఆకళింపు చేసుకోవాలి

● ఆర్యవైశ్య మెరిట్ విద్యార్థుల సన్మాన సభలో ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం



విద్యార్థికి ప్రతిభా అవార్డు అందజేస్తున్న శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం, జూన్ 3)(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను అభ్యసించడంతోపాటు సమాజంలోని మార్పులు గమనిస్తూ, అన్ని అంశాలను ఆకళింపు చేసుకుని ఆయా రంగాలలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆర్యవైశ్య విద్యార్థులకు ఏపీ ఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం ఉద్బోధించారు. స్థానిక లాలాచెరువులోని ఆర్యవైశ్య హాస్టల్‌లో ఆదివారం ఆర్యవైశ్య అఫిషియల్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్మీడియట్ నుంచి ట్రిపుల్ ఐటీ వరకూ వివిధ స్థాయిలలో ఉత్తమ ఫలితాలు సాధించిన 60 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు అవార్డుల ప్రదానం సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అసోషియేషన్ అధ్యక్షుడు పి. రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈసభలో విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందజేశారు. గుంటూరు రెమాండ్స్ మెన్స్ టచ్ మేనేజింగ్ పార్టనర్ టి. అరుణకుమార్, పువ్వాడి చంద్రశేఖర్, పి.కనకరాజు, ఆర్. సుబ్బారావు, ఈ. శంకరనారాయణ, వి.నాగమణి, కేవీ గోపాలకృష్ణ, కె.కనకేశ్వరరావు, ఎం. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి తూర్పు అధ్యకుడిగా మళ్లీ కంచర్ల బాబి ఏకగ్రీవం



ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల బాబీ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుమారు 300 మంది ప్రతి నిధులు ఈసభలో పాల్గొన్నారు. శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, ఆర్య వైశ్య రాష్ట్ర అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు తదితరులు బాబిని అభినందించారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులు రెండుగా వర్గాలుగా ఉండడం వల్ల వారిని ఐక్యం చేయవలసిన అవసరం ఉందని ప్రధానవక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. రెండురోజులలో హైదరాబాద్‌లో చర్చలు మొదలు కానున్నట్టు తెలిపారు.

ఎస్పీ అంటూ బురిడీ

రూ.2.35లక్షలు స్వాహా

రాజమహేంద్రవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్పీనని చెప్పి ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి డబ్బులు దోపిడీ చేయడంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిసిపల్ కాలనీకి చెందిన ఎన్.పామ్‌రాజ్‌కి గత నెల 17న ఓ ఫోన్‌కాల్ వచ్చింది. నీ బ్యాంకు ఖాతాలో రూ.3కోట్లు జమ అయ్యాయి. అవి ఎక్కడి నుంచి వచ్చాయి. మనీ లాండరింగ్ కేసులో నీ పేరు ఉంది. ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని బెదిరించారు. కాసేపటికి ఢిల్లీ నుంచి ఎస్పీని మాట్లాడుతున్నానంటూ ఓ వ్యక్తి వాట్సాప్ కాల్ చేశారు. నీకు అంత మొత్తంలో డబ్బు ఎందుకు వచ్చిందంటూ ప్రశ్నించాడు. పామ్‌రాజ్ చెప్పిన సమాధానంతో ఏకీభవించలేదు. నువ్వు నాకు సహకరిస్తే కేసు లేకుండా చేస్తానని అవతల వ్యక్తి చెప్పాడు. మాటల్లోనే పామ్‌రాజ్ బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నాడు. ఎస్పీ అనే వ్యక్తి చెప్పిన ప్రకారం రూ.50వేలు, రూ.లక్ష జమ చేశాడు. మళ్లీ అవతల వ్యక్తి ఫోన్ చేసి పెద్ద మొత్తం డిమాండ్ చేయగా.. తన ఖాతాలో రూ.85వేలు మాత్రమే ఉన్నాయంటూ ఆ డబ్బులు కూడా బదిలీ చేశారు. ఇలా మొత్తం రూ.2.35లక్షలు పంపించాడు. తర్వాత అటు వైపు నుంచి ఫోన్ రాలేదు. దీంతో అనుమానించిన పామ్‌రాజ్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఇలాంటి ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్ వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. భయంతో లేదా అత్యాశతో మోసపోవద్దని ఆయన కోరారు.

సంతానం కలగడం లేదని ఆత్మహత్య

● కాలువలో దూకిన వివాహిత

ఉండ్రాజవరం, జూన్ 30: సంతానం కలగడంలేదని మనస్తాపం చెందిన ఒక మహిళ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దమ్మెన్నులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మోర్త గ్రామానికి చెందిన తోట రాశి(24)కి 2020లో ఉండ్రాజవరం గ్రామానికి చెందిన దుర్గారావుతో వివాహమైంది. నాలుగేళ్లయినా సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెంది శనివారం దమ్మెన్ను గ్రామం వద్ద నరసాపురం కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతదేహం ఆదివారం లభ్యమయ్యింది. ఆమె తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఉండ్రాజవరం పోలీసులు తెలిపారు.

డిప్యూటీ డీఎంఅండ్‌హెవోపై విచారణ జరపాలి

ఎటపాక, జూన్ 30 : చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్యపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు డిమాండ్ చేశారు. డాక్టర్ పుల్లయ్య డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విలీన మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, బర్త్ వెయిటింగ్ హాల్స్‌కోసం మంజూరీచేసిన నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. డాక్టర్ పుల్లయ్య తెలంగాణలోని భద్రాచలంలో ఓ ప్రయివేట్ ఆసుపత్రి నడుపుతూ, ఆశ, ఏఎన్‌ఎంల సాయంతో రోగులను అక్కడికి తరలిస్తుంటారని ఆరోపించారు. త్వరలో స్థానిక ఎమ్మెల్యే శిరీషాదేవితో కలిసి పుల్లయ్యపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈవిషయమై డాక్టర్ పుల్లయ్యను వివరణ కోరగా వైఎస్ ఎంపీపీ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

ట్యాంకర్ ఢీకొని తాత, మనవడు మృతి



సంఘటనా స్థలంలో పడివున్న తాతా, మనవడిల మృతదేహాలు




మాసా వీర్రాజు, పాముల ధనుష్ చంద్ర (ఫైల్)

కొవ్వూరు, జూన్ 30: మోపెడ్‌ను లారీ ఢీకొన్న ఘటనలో తాత, మనువడు మృతిచెందినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరులోని శ్రీరామకాలనీకి చెందిన మాసా వీర్రాజు (44) ఆదివారం కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో ఉన్న కుమార్తె ఇంటికి భోజనానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తూ ఆరో తరగతి చదువుతున్న మనవడు పాముల ధనుష్‌చంద్ర(11)ను తీసుకుని మోపెడ్‌పై బయలుదేరారు. ఆరికిరేవుల గ్రామంవద్ద గోదావరి ఏటిగట్టు రోడ్డుపై ఎదురుగా వస్తున్న ట్యాంకరు ఢీకొనడంతో ఇద్దరు కింద పడిపోయారు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ధనుష్ చంద్ర తండ్రి పాముల సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

డివైడర్‌ను కారు ఢీకొని ఒకరి మృతి

మరో ఘటనలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్టు సీఐ తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం (అంకంపాలెం) లోని పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గండికోట ఎస్‌వీ జోగినాథం(28) ఈనెల 29న కారులో రాజమహేంద్రవరం షాపింగ్‌కు వచ్చాడు. షాపింగ్ పూర్తిచేసుకుని కల్కి సినిమా సెకండ్ షో చూసి తిరిగి జంగారెడ్డిగూడెం వెళ్తుండగా అర్ధరాత్రి కొవ్వూరులోని ఏబీఎన్, పీఆర్‌ఆర్ డిగ్రీ కాలేజీ సమీపంలో కుక్క అడ్డురావడంతో సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో జోగినాథానికి తీవ్ర గాయాలై పడి ఉన్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తన ఓ డాక్టర్ ఆయనను పరిశీలించి మృతి చెందినట్టు చెప్పారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి గండికోట శ్రీరామ సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జుబేర్ మహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఏజెన్సీలో భారీ వర్షం

● నెల్లిపాక ప్రధాన రహదారిపై కూలీన భారీ వృక్షం
● ఆరేడు గంటలపాటు స్తంభించిన రాకపోకలు

ఎటపాక, జూన్30: ఏజెన్సీలోని ఎటపాక మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. శనివారం అర్ధరాత్రి సమ యంలో భారీ వర్షంపడడంతో కుంటలు, చెరువులు నిండాయి. వాగులు పొంగిపొర్లాయి. వర్షం దాటికి నెల్లిపాక సమీపంలో భద్రాచలం-కూనవరం రోడ్‌లో భారీ వృక్షం నెలకూలింది. దాంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి సుమారు ఆరేడు గంటల పాటు ఈ రహదారిపై రాకపోకలు స్తంభించాయి.



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను యంత్రాలతో తొలగిస్తున్న దృశ్యం



భారీవృక్షం రహదారిపై పడడంతో నిలిచిపోయిన వాహనాలు

కారు బోల్తా
తృటిలో తప్పిన ప్రమాదం

తొండంగి, జూన్ 30: కత్తిపూడి వైపు నుంచి తుని వైపు వెళుతున్న కారు తొండంగి మండలంలో బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్ద బోల్తా కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. డివైడర్‌పై కారు పూర్తిగా తిరగబడి పోయింది. దీంతో స్థానికులు వెంటనే స్పందించి సహాయం అందించారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనాలి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, జూన్ 30: రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒక పండుగాగా జరుగుతుందని, సోమవారం కాకినాడలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ శ్రేణులందరూ పాల్గొనాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన నగర కమిటీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచడంతోపాటు గత మూడు నెలలకు రూ.1,000 చొప్పున కలిపి ఈ నెలలో మొత్తం రూ.7వేలు అవ్వా, తాతలకు ఇస్తున్నామన్నారు. నగర కమిటీ, డివిజన్ కమిటీ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు వారి పరిధిలో పింఛన్ల పంపిణీలో పాల్గొనాలన్నారు. 6వ డివిజన్ రేచెర్లపేటలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తాను పాల్గొంటున్నట్టు ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, నాయకులు గదుల సాయిబాబు, వొమ్మి బాలాజీ, పలివెల రవిఅనంకుమార్, సీకోటి అప్పలకొండ, ఎండీ అన్సర్, నల్లూరి శ్రీనివాస్, జొన్నాడ వెంకటరమణ, రెడ్నం సత్తిబాబు, అమలకంటి బలరామ్, చింతలపూడి రవి, గుజ్జు బాబు, మేడిశెట్టి చిన్ని, పాలిక నాని, గుమ్మళ్ల చిన్న, మాజీ కార్పొరేటర్లు, మహిళా నాయకురాళ్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రోడ్లకు మోక్షమేది?

» ఐదేళ్లపాటు రహదారులను పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
» ప్రజలు, ప్రయాణికులకు అవస్థలు
» కూటమి ప్రభుత్వంపై కొండంత ఆశ


గోతులతో ప్రమాదకరంగా ఉన్న సామర్లకోట కెనాల్‌రోడ్డు, రౌతులపూడిలో అధ్వానంగా రహదారి

సామర్లకోట, జూన్ 30: వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు రహదారులను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. సామర్లకోట రైల్వే గూడ్స్‌యార్డు నుంచి పెదబ్రహ్మదేవం వెళ్లే కెనాల్ రోడ్డుకు ఐదేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పొడవునా పెద్దపెద్ద గోతులు ఏర్పడి అవి పెద్ద నీటి కుంటలుగా మారి వాహనదారులకు ప్రమాదభరితంగా మారాయి. రాత్రివేళల్లో ఈ రోడ్డుమీదుగా ప్రయాణించే ద్విచక్రవాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు ఎంతమాత్రం పట్టించుకోలేదన్న ఆరోపణలు అనేకమున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కెనాల్ రోడ్డు దుస్థితికి మోక్షం కలుగుతుందని కొండంత ఆశతో వాహనదారులు చూస్తున్నారు.

స్కూల్‌కి వెళ్లేదేలా?

రౌతులపూడి, జూన్ 30: రౌతులపూడిలో విద్యార్థులు హైస్కూల్‌కి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. గ్రావెల్ రహదారి కావడం, పెద్ద పెద్ద గోతులు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో ఆ నీటిలో నుంచి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిమ్మెంట్ రహదారిని నిర్మించాలని కోరుతున్నారు.

రైతుల ఆందోళన

కిర్లంపూడి, జూన్ 30: మండలంలోని చిల్లంగి నుంచి వేలంక గ్రామం వెళ్లే కొత్త చెరువు పుంతరోడ్డుకు మోక్షం కలిగించాలని రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. చిల్లంగి గ్రామం మద్దాలవారివీధి మీదుగా ఈ పుంతరోడ్డుపై ఆయకట్టు రైతులు రాకపోకలు సాగిస్తుంటారని, వైసీపీ పాలనలో రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. సుమారు 2 కిలోమీటర్ల మేర రోడ్డు బురదమయంగా మారడంతో గోతులు కనిపించక ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున రోడ్డును అభివృద్ధి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.


చిల్లంగి-వేలంక పుంత రోడ్డు వద్ద రైతుల ఆందోళన

తల్లిదండ్రులు కష్టపడితేనే పిల్లలు ప్రయోజకులు

ఎడెల్ గీవ్ ఫౌండేషన్ సీఈవో నగ్మాముల్లా



సదస్సులో పాల్గొన్న సీఈవో నగ్మాముల్లా, సంకురాత్రి చంద్రశేఖర్

పోర్టుసిటీ (కాకినాడ), జూన్ 30: తల్లిదండ్రులు కష్టపడితేనే పిల్లలు జీవితంలో ఉన్నత స్థితికి చేరి ప్రయోజకులవుతారని ఎడెల్ గీవ్ ఫౌండేషన్ సీఈవో నగ్మాముల్లా అన్నారు. సినిమారోడ్‌లోని సూర్యకళామందిరంలో ప్రముఖ సంఘ సేవకురాలు దివంగత లక్కరాజు శేషకుమారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన మహిళా సాధికార సదస్సులో ఆమె ముఖ్యవక్తగా మాట్లాడారు. సంకురాత్రి ఫౌండేషన్, జేఎన్‌టీయూకే సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నగ్మాముల్లా మాట్లాడుతూ చార్టెడ్ అకౌంటెంట్‌గా మంచిస్థితిలో ఉన్నానని, సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఎడెల్ గీవ్ సంస్థను 12ఏళ్ల క్రితం స్థాపించానని చెప్పారు. కార్యక్రమంలో సంకురాత్రి ఫౌండేషన్ అధినేత పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్, మాజీ కేంద్రమంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు, జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి శేషకుమారి చేసిన సేవలను కొనియాడుతూ మాట్లాడారు. కార్యక్రమంలో శేషకుమారి కుమారుడు లక్కరాజు సత్యనారాయణ(టిక్కు), కస్తూరి, లక్ష్మీ, పేపకాయల రామకృష్ణ, జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ మురళీకృష్ణ, రాజేష్, కైట్ విద్యాసంస్థల అధినేత పోతుల విశ్వం, కైట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'సూర్యనారాయణ సేవలు మరువలేనివి'

తాళ్లరేవు, జూన్ 30: తాళ్లరేవు ఇరిగేషన్ సెక్షన్ డెల్టా లస్కర్ మీసాల సూర్యనారాయణ రైతులకు అందించిన సేవలు మరువలేనివని సెక్షన్ కార్యాలయం ఏఈఈ ఈశ్వరరావు అన్నారు. ఆదివారం తాళ్లరేవు లయన్స్‌క్లబ్ హాలు నందు రైతుసంఘం అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణంరాజు అధ్యక్షతన సన్మానసభ జరిగింది. డెల్టా లస్కర్ దంపతులను జలవనరుల శాఖ ఈస్టర్న్ డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్‌కె.జిలానీ, నీటిసంఘాల మాజీ అధ్యక్షులు వుంగరాల కృష్ణ, కాలాడి కామేశ్వరరావు, కాళ్ల గణపతి, టీడీపీ నేతలు గంజా సూరిబాబు, జక్కల ప్రసాద్‌బాబు సత్కరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు సుబ్రహ్మణ్యం, కృష్ణ త్రిమూర్తులు, సుబ్బారావు, నాగరాజు, చలమయ్య, సత్యనారాయణ, కాంతారావు, ఇరిగేషన్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమం అందించే ప్రభుత్వం

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, జూన్ 30: రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని అందించగల నిజమైన ప్రభుత్వం ఏర్పడిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక పింఛన్లను రూ.4వేలు చేయడమే కాకుండా గత 3 నెలల పెంచి రూ.7వేలు అందించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు, కిడ్నీ, గుండె సంబంధిత అనేక రోగాలు అందించే రూ.5వేలు పింఛన్ రూ.10 వేలు పెంచి అందిస్తున్నామన్నారు. చంద్రబాబు మాట ప్రకారం పింఛన్లు పెంచారని, పేదలపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి పింఛను అందించాలన్నారు. గ్రామాల్లో వలంటీర్ల కన్నా స్కావెంజర్లను ఏర్పాటు చేసుకోవడం ప్రయోజనకరమని నెహ్రూ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికులు తప్పనిసరిగా ఉండాలని, మా నాయకుడు వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని చెప్పున్నారని దానిని గ్రామ విస్తీర్ణం బట్టి స్కావెంజర్లను నియమించుకోవడం మేలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అధినేత దృష్టిని తీసుకువెళ్తారని అవసరమైతే అసెంబ్లీ లో కూడా ప్రస్తావిస్తానన్నారు. సమావేశంలో నాయకులు ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, కొత్త కొండబాబు, గాజింగం సత్తిబాబు, కంచుమర్తి రాఘవ, బద్ది సురేష్, సూరిశెట్టివెంకట శివ, పిల్ల చంటిబాబు, బొండా రాజేష్,సాంబతుల చంద్రశేఖర్ ఉన్నారు.

ఇచ్చిన హామీలను దశలవారీగా అమలుచేస్తాం

ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు, జూన్ 30: గ్రామీణప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలుచేస్తామని, ప్రతీ టీడీపీ కార్యకర్త ధైర్యంగా ఉండాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఆదివారం సుంకటరేవులో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే 5ఫైల్స్‌పై సంతకంచేసి వాటిని అమలుచేస్తున్నారన్నారు. ప్రతీ కార్యకర్త గ్రామాల్లో ఉన్న అవ్వతాతలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా పెంచిన పింఛన్లను అందించాలన్నారు. సత్యనారాయణ,సరస్వతి దంపతులు దాట్లను సత్కరించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, జక్కల ప్రసాద్‌బాబు, గంజా సూరిబాబు, పిల్లి సత్తిబాబు, వడ్లమూరి సతీష్, పొన్న మండ రామలక్ష్మి, జనసేన నేత అత్తిలి బాబూరావు, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు పాల్గొన్నారు.

పసుపు గొడుగుల పంపిణీ



జగ్గంపేట, జూన్ 30: టీడీపీ యువ నేత, రుచి హోటల్ అధినేత నాగేంద్ర చౌదరి జగ్గంపేటలోని తమ హోటల్ వద్ద పాదచారులు, స్కూల్ పిల్లలకు 200 పసుపుగొడుగులు ఉచితంగా పంపిణీ చేశారు. తమ నేత ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై అభిమానంతో వర్షాకాలం కారణంగా ప్రజలకు సాయం అందించాలనే సంకల్పంతో గొడుగులు అందించామని,ఇలాంటి కార్యక్రమాలు చేస్తామన్నారు.

జ్యోతుల నవీన్ పరామర్శ

గండేపల్లి, జూన్ 30: మండలంలోని తాళ్ళూరు గ్రామ టీడీపీ సీనియర్ నేత, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు పాలచర్ల సత్యనారాయణ అనారోగ్యానికి గురవడంతో ఆదివారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరామర్శించారు. ఆయన వెంట కోర్పు సాయితేజ, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి తదితరులున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో విశేష పూజలు

అన్నవరం, జూన్ 30: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిదిలో ఆదివారం ఆరోగ్యప్రదాత అయిన సూర్యభగవానుడికి విశేషపూజలు నిర్వహించి వివిధ ఆసనాలతో అర్చించారు. 10 గంటలకు కళామందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించి క్షీరాన్నం నివేదించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. భక్తులకు వీటిని పంపిణీ చేశారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చైర్మన్

ఎమ్మెల్యే సత్యప్రభ ఇంటి వద్ద కోలాహలం


ప్రత్తిపాడులో ఎమ్మెల్యే సత్యప్రభను కలిసిన జనసేన నాయకులు

ప్రత్తిపాడు, జూన్ 30: ప్రత్తిపాడులోని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఇంటి వద్ద ఆదివారం సాయంత్రం జనసైనికుల కోలాహలం నెలకొంది. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, వీర మహిళ దళే జ్యోతి, రాసంశెట్టింరాజాలతో పాటు 300 మంది పైబడి జనసైనికులు నియోజకవర్గవ్యాప్తంగా ప్రత్తిపాడు తరలివచ్చి సత్యప్రభను కలిశారు. నియోజకవర్గంలో జనసైనికులు అభివృద్ధి కార్యక్రమాల్లో సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే సిరిపురం, ధర్మవరం, యుజేపురం తదితర గ్రామాలకు చెందిన నాయకులు కొత్త ప్రభాకర్, కొప్పుల సత్యనారాయణ, గొర్లనాగేశ్వరరావు, పెద్ద ఎత్తున కూటమి కార్యకర్తలు సత్యప్రభను కలిసి అభినందించారు. పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యులు యశస్విని, నియోజకవర్గ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు రామంశెట్టి రాంబాబు, పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది కూడా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

రౌతులపూడిలో సత్యప్రభ పర్యటన

రౌతులపూడి, జూన్ 30: ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా ఆదివారం పారుపాకలో ఓ ఫంక్షన్‌కు హాజరై అనంతరం గ్రామంలో పర్యటించారు. ప్రతి ఇంటికి పింఛన్లు అందేలా చూడాలని టీడీపీ నేతలకు ఆదేశాలు జారీచేసారు. ఎమ్మెల్యే విజయం సాధించిన తొలిసారి గ్రామానికి విచ్చేసిన సత్యప్రభకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, కోసూరి శ్రీని వాసవర్మ, తిరుమల వెంకన్నదొర పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థానిక ప్రవేటు ఫంక్షన్ హోల్‌నందు లింగంపర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, ప్రత్తిపాడు జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్య బాబు విచ్చేసి వెంకటేశ్వరరావు దంపతులకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.

యువత సాంకేతిక నైపుణ్యానికి కేంద్రంగా ఉండాలి : ఎంపీ


ఎంపీకి జ్ఞాపిక అందజేస్తున్న స్పార్క్ సభ్యులు

ఏలేశ్వరం, జూన్ 30: యువత సాంకేతిక నైపుణ్యానికి కేంద్రంగా ఉండాలని ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కాకినాడ జనసేన పార్టీ కార్యాలయంలో స్పార్క్ చైర్మన్ సందీప్ శ్రీనివాస్‌ను కలిసి అంతరిక్ష సాంకేతిక విద్య,శాస్త్రీయ పరిజ్ఞానంలో వినూత సంస్థగా స్పార్క్ ఎదిగిందని వివరించారు. ఎంపీకి స్పార్క్ సంస్థ జ్ఞాపికను అందజేశారు. ప్రత్తిపాడు జనసేన ఇన్ చార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, రవి కిరణ్, వరుపుల సాయి కిరణ్ తదితరులున్నారు.

ప్రధాని మన్‌కీ బాత్ వీక్షణ


ఏలేశ్వరంలో వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు, జూన్ 30: ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని ధర్మవరంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. ప్రధాని మోదీ వివరించిన అంశాలను కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని బీజేపీ ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు కోరారు.

ఏలేశ్వరం: ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఏలేశ్వరంలో బీజేపీ శ్రేణులు వీక్షించారు. పట్టణాధ్యక్షుడు రెడ్డి లోవరాజు ఆధ్వర్యంలో పట్టణంలో స్క్రీన్ ఏర్పాటు చేశారు. జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, గట్టెం వెంకటరమణ, వెలుగూరి హరేరామ్, రాతికింద కృష్ణారావు, గొల్లపల్లి త్రినాథ్, ఆర్.వరలక్ష్మి, వాగు రమేష్, పైల అయ్యప్ప పాల్గొన్నారు.

మనోజ్‌కుమార్‌రెడ్డికి డాక్టరేట్

గండేపల్లి, జూన్ 30: సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విభాగంలో సేవలందిస్తున్న కె.మనోజ్‌కుమార్‌రెడ్డి డాక్టర్ ఎ.కైలాసరావు మార్గనిర్దేశ్యంలో డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు సహకారంతో అప్టిమల్ అలోకేషన్ ఆఫ్ యూనిఫైడ్ పవర్ ఫ్లో కంట్రోలర్ ఇన్‌లార్జ్ స్కేల్ పవర్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్స్ టు మినిమైజ్ కాస్ట్ అండ్ పవర్‌లాస్ అనే అంశంపై సమర్పించిన థీసిస్‌కు కాకినాడ జేఎన్టీయూ డాక్టరేట్ డిగ్రీ ప్రకటించిందని ఆదిత్య వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు.

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S.235/2023

Between:
బొగిరెడ్డి వెంకటరమణ – వాది
And
పులిదిండి మెషేక్ సామ్యూల్ బాబురావు – ప్రతివాది

పై నెంబరు దావా వాది, ప్రతివాదిపై పరిహారం కోరుతూ దాఖలు చేయడమైనది. సదరు దావాలో ప్రతివాదికి ఎన్నిమార్లు సమన్లు పంపినను త్రిప్పి వేయుచున్నందున కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం యిందుమూలముగా తెలియచేయునది ఏమనగా పై నెంబరు దావా **ది.వి.05-07-2024**వ తేదీ వాయిదా అయివున్నది.

కావున మీరు పై కోర్టువారు ఎదుట ఉదయం 10.30 గం.లకు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని అభ్యంతరములు యున్న తెలుపుకొన గలరు. లేని యెడల మీ పరోక్షములో నిర్ణయించ బడునని గ్రహించ గలరు. వివరాలకు.

K.V.V. CHALAPATHI, M.A.B.L.D.P.M
Advocate
D.no. 9-11-136, Gandhi Nagar
Nookalamma Temple Street,
Kakinada.
Cell:98482 60426

కాకినాడ
05.06.2024

ఈ రోడ్లకు మోక్షమేది?



గోతులతో ప్రమాదకరంగా ఉన్న సామర్లకోట కెనాల్‌రోడ్డు, రౌతులపూడిలో అధ్వానంగా ఉన్న రహదారి

సామర్లకోట, జూన్ 30: వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు రహదారులను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. సామర్లకోట రైల్వే గూడ్స్‌యార్డు నుంచి పెదబ్రహ్మదేవం వెళ్లే కెనాల్ రోడ్డుకు ఐదేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పొడవునా పె ద్దపెద్ద గోతులు ఏర్పడి అవి పెద్ద నీటి కుంటలుగా మారి వాహనదారులకు ప్రమాదభరితంగా మారా యి. రాత్రివేళల్లో ఈ రోడ్డుమీదుగా ప్రయాణించే ద్విచక్రవాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు ఎంతమాత్రం పట్టించుకోలేదన్న ఆరోపణలు అనేకమున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావ డంతో కెనాల్ రోడ్డు దుస్థితికి మోక్షం కలుగుతుందని కొండంత ఆశతో వాహనదారులు చూస్తున్నారు.

స్కూల్‌కి వెళ్లేదేలా?

రౌతులపూడి, జూన్ 30: రౌతులపూడిలో విద్యార్థులు హైస్కూల్‌కి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. గ్రావెల్ రహదారి కావడం, పెద్ద పెద్ద గోతులు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో ఆ నీటిలో నుంచి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిమ్మెంట్ రహదారిని నిర్మించాలని కోరుతున్నారు.

రైతుల ఆందోళన

కిర్లంపూడి, జూన్ 30: మండలంలోని చిల్లంగి నుంచి వేలంక గ్రామం వెళ్లే కొత్త చెరువు పుంతరోడ్డుకు మోక్షం కలిగించాలని రైతులు ఆదివారం ఆం దోళన చేపట్టారు. చిల్లంగి గ్రామం మద్దాలవారివీధి మీదుగా ఈ పుంతరోడ్డుపై ఆయకట్టు రైతులు రాకపోకలు సాగిస్తుంటారని, వైసీపీ పాలనలో రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. సుమారు 2 కిలో మీటర్ల మేర రోడ్డు బురదమయంగా మారడం తో గోతులు కనిపించక ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున రోడ్డును అభివృద్ధి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

'యువతకు మార్గనిర్దేశం ప్రధాన లక్ష్యం'



సమావేశమైన యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు

కరప, జూన్ 30: సమాజంలో యువతకు మార్గనిర్దేశం చేయడం యంగ్ మైండ్స్ ప్రధాన లక్ష్యమని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ తెలిపారు. కరపలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నాలుగు అంశాల ప్రాతిపదికగా పలువురు ఉపాధ్యాయులతో కలిసి ఈ యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేశామన్నారు. విద్యార్థులు, యువ కుల్లో క్రియేటివిటీని పెంపొందించడం, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా దిశానిర్దేశం చేయడం, ఆకలితో ఉన్న అన్నార్తులను ఆదుకోవడం, వైద్య సలహాలు, సూచనలు, రక్తదానం, సేవాకార్యక్రమాలు చేయడం, యోగా, ధ్యానం, వ్యాయామాలపై ఆసక్తి కల్పించడం వంటివి సంస్థ ద్వారా చేపడతామన్నారు. సంస్థ యూత్ ఐకాన్‌గా జనసేన యువనాయకుడు పంతం సందీప్‌ను ఎంచుకున్నామని ఆయన చెప్పారు. సంస్థ అధ్యక్షుడిగా తాను, కార్యదర్శిగా డి.బాపిరాజు, ఉపాధ్యక్షుడిగా పడాల ఏడుకొండలు, గౌరవాధ్యక్షుడిగా ఎస్.కృష్ణకుమార్, సభ్యులుగా బి.మంగారావు, కె.రామకృష్ణ, ఎ.వెంకటరమణలను నియమించినట్టు ఆయన వివరించారు. అనంతరం సందీప్‌ను కలిసి పుష్పగుచ్ఛాలందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పాదగయ ఈవోగా దుర్గాభవానీ



పిఠాపురం, జూన్ 30: పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్‌గా ఏపీ దుర్గాభవానీ ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆమె రాజమహేంద్రవరం దేవదాయశాఖ ఆర్‌జేసీ కార్యాలయంలో జ్యుయలరీ వెరిఫిషన్ ఆఫీసరుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకూ పాదగయ ఈవోగా పనిచేసిన ఏసీ పులి నారాయణమూర్తి ఉద్యోగ విరమణ చేయడంతో దుర్గాభవానీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పాదగయకు వచ్చిన ఆమె కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూ జలు నిర్వహించారు, అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈవోను ఆలయ సిబ్బంది, అర్చకులు కలుసుకుని అభినందనలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాదగయ పరిసరాలను పరిశీలించారు. భక్తులు, దాతలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది అందరూ తప్పనిసరిగా యూనిఫారమ్ ధరించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులతో గౌరవంగా, మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు.

'అర్హులందరికీ సంక్షేమ ఫలాలు'

కరప, జూన్ 30: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించి, రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జనసేన నేత పంతం సందీప్ పేర్కొన్నారు. కరప చిరంజీవి కల్యాణమండపంలో ఆదివారం మండల జనసైనికులు సందీప్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించా రు. సందీప్ వందలాది మంది నాయకుల సమక్షంలో కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. జనసైనికులు శాలువాలు కప్పి, భారీ గజమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు పేద మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. సందీప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ సారథ్యంలో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్తుందన్నారు. కాకినాడరూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే పంతం నానాజీ కృతనిశ్చయంతో ఉన్నారని స్పష్టం చేశారు. జనసేన నాయకులు బండారు మురళి, బోగిరెడ్డి గంగాధర్, బోగిరెడ్డి కొండబాబు, తుమ్మలపల్లి గోవింద రాజులు, రెడ్డిపల్లి భాస్కర్, గంటా వీరన్నచౌదరి, అవినాశ్, యాళ్ల పండు, ముద్రగడ రమేష్, ముమ్మిడి పుష్పలత, చింతా వెంకట్, గంటా నానిబాబు, శ్రీనివాస్ ఉన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో సూర్యనమస్కారాలు

అన్నవరం, జూన్ 30: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం ఆరోగ్యప్రదాత అయిన సూర్యభగవానుడికి విశేషపూజలు నిర్వహించి వివిధ ఆసనాలతో అర్పించారు. 10గంటలకు కళామందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించి క్షీరాన్నం నివేదించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం భక్తులకు వీటిని పంపిణీ చేశారు.

'స్థూలకాయంతో కీళ్లు అరుగుదల'

సర్పవరం జంక్షన్, జూన్ 30: ప్రజల మారిన జీవనశైలితో శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడంతో ప్రతీ ఒక్కరూ స్థూలకాయం సమస్యతో బాధపడుతున్నారని, ఫలితంగా కీళ్లు అరుగుదలతో సతమతమవుతున్నారని డాక్టర్ చల్లా భార్గవతేజ అన్నారు. ఆదివారం సర్పవరం కల్యాణమండపంలో గ్రామ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ శిబిరం నిర్వహించారు. వైద్యులు సుమారు రూ.1500 విలువల ఎముకల సాంద్రత పరీక్షలను చేశారు.